క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా సహదేవి


ఎస్‌ఐ సహదేవి

పెద్దపంజాణి: పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా సహదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై చిత్తూరు వీఆర్‌కు వెళ్లారు. పలమనేరు పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెద్దపంజాణి నూతన ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

అమర సైనికులకు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

పలమనేరు: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన వీర సైనికులకు స్థానిక మాజీ సైనికులు, వీహెచ్‌పీ నేతలు బుధవారం ఘన నివాళులర్పించారు. మృతిచెందిన వీర జవాన్ల ఫొటోలతో కూడిన బ్యానర్‌తో పట్టణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మిలటరీ సిద్దయ్య, తాతయ్య, ఫైనాన్స్ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్‌లో పారిశుధ్య పనులు


శుభ్రమైన టమాట మార్కెట్

పలమనేరు: పలమనేరు టమాట మార్కెట్‌లో పారిశుధ్య పనులను స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అపరిశుభ్రంగా ఉన్న చోట్ల పరిశుభ్రం చేయించారు. సరుకు కోసం వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలను తీసుకున్నారు. మార్కెట్ సిబ్బంది స్వయంగా టమాట వేలం పాటలో పాల్గొంటున్నారు. దీంతో టమాట ధరల పెరుగుదలకు కారణమైంది. ఇటీవల టమాట రైతులు ఇక్కడ ధరల తగ్గుదలకు మండీ వ్యాపారులే కారణమంటూ ఆందోళనలకు దిగడం తెలిసిందే. ఎట్టకేలకు మార్కెట్ అధికారులు స్పందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

23న డాన్స్ పోటీలు

శాంతిపురం: ఎస్.శ్రీనివాసులు స్మారక డాన్స్ పోటీలను ఈనెల 23న నిర్వహిస్తున్నట్టు డాన్స్ వారియర్స్ టీం ఓ ప్రకటనలో తెలిపింది. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి దుంకుమాకనపల్లి (తుమ్మిశిరోడ్డు)లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేల నగదుతో పాటు ఏడు అడుగుల ట్రోఫీ, 2వ బహుమతిగా రూ.7వేలతో పాటు ఆరు అడుగుల ట్రోఫీ, మూడో బహుమతిగా రూ. 6వేలు, ఐదు అడుగుల ట్రోఫీ ఇస్తామని తెలిపారు. మొత్తం పది నగదు బహుమతులు, ట్రోఫీలతో పాటు ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డు అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8099170790, 9113555745 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ


ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపంజాణి: మండలంలోని మాదనపల్లి పంచాయతీ కత్తార్లపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రం సరిహద్దు వరకు రూ.1.52 కోట్లతో నిర్మిస్తున్న 2.15 కి.మీ సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. అదే విధంగా అప్పినపల్లి పంచాయతీ కేంద్రంలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. నేతలు మాజీ ఎంపీపీ రెడ్డివారి విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, ఆనంద, చలపతి పాల్గొన్నారు.
బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె–నెల్లిపట్ల రహదారిలోని మిట్టపల్లె మీదుగా నాగిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డి భూమి పూజచేశారు.

21న శాకాంబరీ ఉత్సవం

కాణిపాకం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో 21న శాకాంబరీ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మరగదాంబిక దుర్గాదేవిని కూరగాయలు, పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. ఉదయం 6 గంటలకు మహా మంగళ హారతి, 10 గంటలకు వ్యాస భగవానుడికి విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడో?





- నిరుద్యోగులకు తప్పని ఎదురుచూపులు
- భృతిపైనే వయస్సు మీరిన వాళ్ల ఆశలు
- ఇవన్నీ జరిగేనా అని అనుమానాలు

పలమనేరు: గత ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి పార్టీ సూపర్ సిక్స్‌లో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతిగా హామీలిచ్చింది. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈ హామీలు ఎప్పటి నుంచి అమలవుతాయోనని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించి విద్యార్హత ఏంటి, వయస్సుపై ఇంతవరకు స్పష్టత లేదు. ఈ విషయమే నిరుద్యోగులకు మరింత కలవరపెడుతోంది. ఇదంతా ఎన్నటికీ జరిగేది, తమకు ఎప్పుడు మేలు కలుగుతుందోననే అనుమానాలు లేకపోలేదు.

నియోజకవర్గంలో 40వేల మంది దాకా నిరుద్యోగులు..

నియోజకవర్గంలో మున్సిపాలిటీతోపాటు ఐదు మండలాల్లో కలిపి జనాభా 3.20లక్షల మంది, 2.67లక్షల ఓటర్లున్నారు. ఇక్కడ 75వేల కుటుంబాలున్నాయి. ఇందులో నిరుద్యోగులు 40 వేల మంది దాకా ఉన్నట్టు కొన్ని స్వచ్ఛంద సంస్థలు సేకరించిన వివరాలున్నాయి. ఈ ప్రాంతం అటు బెంగళూరు, చెన్నైలకు సమీపంలో ఉండడంతో మరో 20వేల మంది దాకా అక్కడ ప్రైవేటు ఉద్యోగాల్లో ఉంటున్నారు.

ఏడాదికి రూ.144 కోట్లు కావాలి..

కూటమి తమ సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతిని ఇవ్వాలంటే ఇక్కడున్న 40 వేల మందికి నెలకు రూ.3వేల చొప్పున రూ.12 కోట్లు ఆలెక్కన ఏడాదికి రూ.144 కోట్లను ఇవ్వాల్సి ఉంటుంది. ఇది జరిగేనా అనే అనుమానాలు నిరుద్యోగులకే కాదు సామాన్య ప్రజలకు సైతం నమ్మశక్యంగా లేదనే మాట వినిపిస్తోంది.

ఎన్ని కొర్రీలు పెడతారో..?



మొన్న తల్లికి వందనంలోనే కూటమి తిరకాసు ప్రజలకు బాగా అర్థమైంది. ఇక ఇంటింటికీ ఉద్యోగం, నిరుద్యోగభృతిని అమలు చేయడం ఆషామాషీ కాదనిపిస్తోంది. ఒకవేళ ఇప్పుడు కూటమి అమలు చేసినా నూటికొక్కరికైనా ఇస్తారోలేదో అర్థంకావడం లేదు. వీరి హామీలను నమ్మి ఓటేశాం.
–రెడ్డి సరళ, ఎంసీపీ, పలమనేరు

నిరుద్యోగభృతి అమలు ఆషామాషీకాదు..



ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి హామీని అమలు చేయడం అంత ఆషామాషీకాదు. దీనిపై ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం లెక్కలు కట్టి ఇది అంత సులభంకాదనే చెబుతున్నారు. కానీ కూటమి సర్కార్ ఏ ధైర్యంతో హామీ ఇచ్చిందో అర్థంకావడం లేదు. ఇప్పుడున్న రాష్ట్ర బడ్జెట్, అప్పులు చూస్తుంటే ఇది వీలవుతుందా అనే అనుమానాలు రాకతప్పవు.
–సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం అధ్యక్షుడు

నిరుద్యోగభృతి కష్టమే...



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఉచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటే మన రాష్ట్ర ఆదాయం చాలదు. అప్పులు చేసినా అమలు చేయడం అసాధ్యం. ముఖ్యంగా ఇంటికో ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగభృతి ఇవ్వాలంటే కష్టమే. ఇది అమలవుతుందని నిరుద్యోగులకే నమ్మకం లేదు.
–పార్థసారథిరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు, పలమనేరు

ఘనంగా పీర్ల ఊరేగింపు


పుంగనూరులో పూజలందుకున్న పీర్లు

పుంగనూరు: పట్టణంలోని సుబేదారువీధి, కుమ్మరవీధి ప్రాంతాల్లో పీర్లను అలంకరించి ప్రార్థనలు చేసి ఘనంగా పీర్లను ఊరేగించారు. అలాగే మండలంలోని కుమ్మరగుంట గ్రామంలో పీర్లను ఊరేగించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండం ఏర్పాటు చేశారు. పీర్ల వద్ద పేదలకు అన్నదానం చేశారు.

వారపు సంత వేలం రేపు

పెద్దపంజాణి: మండల కేంద్రంలో ప్రతి బుధవారం గ్రామ పంచాయతీ వారిచే నిర్వహించే వారపు సంతలో గేటు వసూలుకు 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ అఖిల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పీఎస్ సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.18వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలం పూర్తయిన వెంటనే హెచ్చుపాటదారుడు వేలం మొత్తంతో పాటు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాలని పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దపంజాణి: ప్రతిఒక్కరూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండలంలోని బసవరాజు కండ్రిగ గ్రామంలో రాయలపేట ఆరోగ్యకేంద్రం సిబ్బందితో కలసి పర్యటించారు. ముందుగా గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. జ్వర పీడితులకు మలేరియా, డెంగీ రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి గంగయ్య, సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

బైరెడ్డిపల్లి: దోమలు విజృంభించకుండా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని పాతపేటలో వైద్యాధికారి విజయ్‌చంద్ర అవగాహన కల్పించారు. గ్రామంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది నిరూపమ, అరబ్‌జాన్, బేగం, అంబికా పాల్గొన్నారు.

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ మణికంఠ చందోలు


ఎస్పీ మణికంఠ చందోలు

ఐరాల: సైబర్ కేసులతో పాటు మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసుల పట్ల ప్రజలు విశ్వాసం, గౌరవం పెంపొందించేలా విధులు నిర్వర్తించాలన్నారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. మాదకద్రవ్యాలు, సారా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఎవరైనా హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు ఎస్పీకి ఎస్‌ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి గౌరవ వందనం చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

గుడిపాల: కమ్మతిమ్మపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ లేట్ క్రిష్ణమందడి, కన్నమ్మ జ్ఞాపకార్థంగా చిత్తూరులోని సంజీవిని ఐకేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో మనోరమ మల్టిస్పెషాలిటీ, మహేష్ ఆర్థో స్పెషలిస్ట్ క్లినిక్ వారు కూడా పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా కంటి పరీక్షలు, బీపీ, షుగర్, ఎముకల సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పి వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 200 మంది రోగులు పాల్గొన్నారు. వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు ఉదయ్‌కుమార్, గీత అనూష, మహేష్ రెడ్డి, నోబుల్‌రావు, దుర్గాప్రసాద్‌లతోపాటు, ఉపాధ్యాయులు వెంకటేష్, లక్ష్మణరావు, సౌందర్‌రాజన్ పాల్గొన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ ఉచితంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై అవగాహన


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న నాగపద్మిని

పాలసముద్రం: పండించిన పంటల దిగుబడులను సుస్థిర పరచడానికి సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌సీ–డీటీసీ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మిని తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పంలో వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ సాగు, సూక్ష్మ పోషకాల యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మట్లాడుతూ రైతులు పంటల సాగులో నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువులే కాకుండా సూక్ష్మ పోషకాలైన జిప్సం, బోరాన్, గంధకం వంటి ఎరువులు ఏ సమయంలో ఎంత మోతాదు వినియోగించాలనే దానిపై పూర్తిస్థాయిలో వివరించారు. వేరుశనగ పంటకు తెగుళ్ల సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేరుశనగకు ఆకుముడత, ఆకుపచ్చ, లద్దె పురుగు వంటివి ఎక్కువగా సోకుతాయన్నారు.

ఆకుముడత లక్షణాలు..

రెండు నుంచి మూడు ఆకులను పురుగు ఒక దగ్గరకు చేర్చి గూడులా మార్చుకుని ఆకుల్లో పత్రహరితాన్ని పీల్చేస్తుంది. దీంతో మొక్కల పెరుగుదలపై ప్రభావం పడుతుంది. తెగుళ్ల నివారణకు ప్రొఫెనాపాస్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల వరకు పిచికారీ చేయాలి. లద్దె పురుగు పగటి వేళ భూమిలో దాక్కుని రాత్రివేళ బయటకు వచ్చి మొక్కలపై చేరి ఆకులను కొరికి తింటుంది. మొక్క కొమ్మలను మాత్రమే మిగులుస్తుంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి గీత, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్లో చర్యలు షురూ


ఎస్సీ హాస్టల్‌లో పనిచేస్తున్న వాటర్ ప్యూరిఫైర్




ఎస్సీ-2 హాస్టల్‌లో తిరుగుతున్న కొత్త ఫ్యాన్లు, హాస్టళ్లను తనిఖీ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పారిశుధ్యం లోపించి తాగేందుకు సరైన మంచినీరు లేక దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలను సంక్షేమశాఖ అధికారులు బుధవారం చేపట్టారు. 'వసతి.. అధోగతి' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై స్థానిక సంక్షేమ శాఖ ఎస్‌డబ్ల్యూఓ హైమావతి తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆమె పరిధిలోని అన్ని హాస్టళ్లను తనిఖీ చేశారు. అక్కడి సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. దీంతో పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మురుగునీటిని తొలగించారు. కలుషితమైన నీటి స్థానంలో మంచినీళ్ల ట్యాంకర్లను తెప్పించి నీటిని వేడిచేసి ఆపై పిల్లలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. అన్ని హాస్టళ్లలో దెబ్బతిన్న కిటికీ మెస్‌లను సరిచేశారు. పట్టణంలోని గుడియాత్తం రోడ్డులోని ఎస్సీ–1 హాస్టల్‌లో మరమ్మతుకు గురైన ఫ్యాన్ల స్థానంలో హాస్టల్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి కొత్త ఫ్యాన్లను అమర్చారు. బీసీ హాస్టల్ వద్ద దోమలు రాకుండా గదులకు అవసరమైన చర్యలను వార్డెన్ సోమసుందర్‌రెడ్డి హుటాహుటిన తీసుకున్నారు. మరోవైపు సాక్షిలో వెలువడిన కథనం చూసి పలువురు దాతలు సైతం తమకు తోచిన సాయం చేసి హాస్టళ్లల్లో సమస్యల సాధనకు కృషిచేస్తామంటూ ముందుకొస్తున్నారు.

చౌడేపల్లె పీహెచ్‌సీ తనిఖీ




ఎక్స్‌వేటర్‌తో పరిశుభ్రత పనులు, గదిలో పడేసిన మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది నిర్లక్ష్యంతోపాటు రోగులకు అందాల్సిన విలువైన మందులను మూలనపడేయడంతో సాక్షిలో ఈనెల 17న 'నిలువెత్తు నిర్లక్ష్యం' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన చిత్తూరు జిల్లా డీఎంహెచ్‌ఓ ప్రభావతి బుధవారం ఆకస్మికంగా ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. ఆసమయంలో ఉండాల్సిన ఇద్దరు వైద్యులు విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందాల్సిన సేవల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఓ గదిలో మూలనపడేసిన విలువైన మందులను పరిశీలించి, సిబ్బంది తీరుపై మండిపడ్డారు. 104 వాహనానికి కేటాయించిన మందులు వినియోగించుకోకుండా మూలన పడేశారని గుర్తించి వాహనం డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను మందలించారు. మీకు స్టాక్ అవసరం లేకుంటే సమీపంలోని పీహెచ్‌సీలకు అప్పగించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాట్లు మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో పాటు రోగులపట్ల వైద్యసిబ్బంది దురుసుగా వ్యవహరించడం ఏమిటని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి చుట్టూ పారిశుధ్యం లోపించి విషపురుగులకు నిలయాలుగా మారాయని గుర్తించి ఎక్స్‌వేటర్‌తో పనులు ప్రారంభించారు. ఈ ఘటనపై నివేదికలను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

నీటి నాణ్యతా పరీక్షలు గాలికి!




బండపై ఇండ్లు యానాదుల కాలనీలో నీటిని వడగట్టి పట్టుకుంటున్న దృశ్యం, కార్యాలయంలో మూలనపడిన నీటి నాణ్యతా పరీక్షల కిట్స్

- శుభ్రం చేయని ట్యాంకుల నీటి సరఫరా ప్రమాదం
- డైరెక్ట్ పంపింగ్‌తోనూ తప్పని కలుషితం
- పల్లెల్లో పలుచోట్ల పైపుల లీకేజీలు
- రోగాలకు కారణమవుతున్న వైనం

పలమనేరు: గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం అందించే రక్షిత మంచినీరు పరిశుద్ధంగా ఉందా లేదా అనే పట్టించుకునే వారే కరువయ్యారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో స్కీమ్‌బోర్ల పైప్‌లైన్లు దెబ్బతినడంతో అపరిశుభ్రమైన నీరే సరఫరా అవుతోంది. గ్రామాల్లోని సగం ట్యాంకులను శుభ్రం చేయడమే లేదు. కొందరు సర్పంచులు మాత్రం ట్యాంకులను కడిగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో విధిలేని పరిస్థితుల్లో ఈ నీటినే జనం తాగాల్సి వస్తోంది. వర్షాకాలం కాబట్టి కచ్చితంగా ప్రతినెలా పంచాయతీల పరిధిలో నీటి నాణ్యతా పరీక్షలు చేయాల్సి ఉన్నా వీటి గురించి పట్టించుకునే వారేలేరు. అంటువ్యాధుల కారణంగా ట్యాంకుల నుంచి నీటిని చాలాచోట్ల సరఫరా చేయకుండా బోర్ల నుంచి డైరెక్ట్ పంపిగ్ ద్వారా వదులుతున్నారు. అయితే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా డైరెక్ట్ పంపింగ్ నీళ్లు సైతం కలుషితమయ్యే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా శుభ్రం చేయని ట్యాంకుల నుంచి కొళాయిలకు సరఫరా అయ్యే గ్రామాల్లో నీటి కలుషితం ఎక్కువగా ఉంది. నీటి నాణ్యతా పరీక్షలకు గత ప్రభుత్వం అందజేసిన కిట్లు, కెమికల్స్ సంబంధిత పంచాయతీ కార్యాలయాల్లో అటకెక్కాయి. ఇక ఈ ప్రభుత్వంలో ఇంకా వీటి గురించి ఆలోచనే లేదు. గ్రామాల్లో స్కీమ్‌బోర్లకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. ఫలితంగా నీరు నిల్వ ఉండి కలుషితానికి గురై జనానికి ఇబ్బందులకు గురిచేస్తోంది. వీటి మరమ్మతులకు సైతం స్థానిక సంస్థలకు నిధుల లేమి ఇబ్బందిగా మారింది. ఫలితంగా వ్యాధులు సోకుతున్నాయి. ఇది అసలే వర్షాకాలం కావడంతో సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది.

నీటి నాణ్యతా పరీక్షలు ఎక్కడ?..

మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాల్సి ఉంది. దీనిపై అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించాలి. వీరు ప్రతి పంచాయతీకి ఒక ఏఎస్‌ఎం, అంగన్‌వాడీ టీచర్‌ను ఎంపిక చేసి వారికి నీటి పరీక్షలు ఎలా నిర్వహించాలో శిక్షణనిస్తారు. ఇందుకు సంబంధించి కిట్లు, అవసరమైన రసాయనాలను పంపిణీ చేయాల్సి ఉంది. వీరు స్కీమ్ బోర్లలోని నీటిలో నైట్రేట్, ఫ్లోరైడ్, డీసాల్ట్ సాలిడ్స్, క్షార జలసాంద్రత, బీసీజీ–ఎంఆర్ నిర్వహించాల్సి ఉంది. దీంతోపాటు రక్షిత మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. కానీ ఈ ప్రభుత్వంలో ఇంతవరకు దీనిపై శిక్షణ లేదు పరీక్షలు లేవు. ఈవిషయమై పలమనేరు ఎంపీడీఓ రాజేష్‌ను వివరణ కోరగా నీటి పరీక్షలకు సంబంధించిన కిట్లు ఇంకా అందలేదని, దీనిపై జేసీ వీసీ ఉందని త్వరలో కార్యక్రమాలు ఉండొచ్చని తెలిపారు.